ప్రజాశక్తి
సోమవారం 5 జూన్ 2023 8 పేజీలు


గుంటూరు


పల్నాడు

పెరుగుతున్న వాయు కాలుష్యం

ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న సూక్ష్మ ధూళి కణాలు - నేడు ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినం





ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లాలో స్వచ్ఛమైన గాలి పీల్చుకోవడం గగనమవుతోంది. వాయు కాలుష్యం పరిధి దాటుతోంది. పరిశ్రమలు, ఆటోమొబైల్ రంగం గుంటూరు పరిసరాల్లో విస్తరిస్తోంది. పెరుగుతున్న వాహనాలు, ఇంధన వినియోగం భారీగా పెరిగింది. విషవాయువులు, సూక్ష్మ, అతి సూక్ష్మ దూళికలు పెరుగుతున్నాయి. పెరుగుతున్న కాలుష్యానికి ప్రత్యామ్నాయంగా విద్యుత్ వాహనాలను పెంచాలన్న ప్రణాళికలు ఇంకా కార్యరూపం దాల్చడంలేదు. గ్యాస్ (సిఎన్‌జి) ఆధారిత వాహనాలు కూడా పరిమిత సంఖ్యలోనే ఉన్నాయి. సూక్ష్మధూళి కణాలతో పాటు నగర పరిసరాల్లో మిర్చి ఆధారిత పరిశ్రమల వల్ల కోరు పెరిగి ఊపరితిత్తుల సమస్యలు ఏర్పడుతున్నాయి.

గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సైడు కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రపర్చకపోవడం, భూగర్భ డ్రెయినేజి వ్యవస్థ ఏర్పాటు పనులు నిలిచిపోవడంతో చాలా ప్రాంతాల్లో మురుగు కాల్వల నుంచి దుర్గంధం వెదజల్లుతుండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వాహనాల నుంచి వస్తున్న కాలుష్యం (పొగ) పరిసర ప్రాంతాలకు వెదజల్లుతోంది. దీంతో గాల్లో సూక్ష్మ దూళికణాల సంఖ్య పెరుగుతోంది.

నగరంలో చాలా ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు, తారు రోడ్లున్నా ఇప్పటికీ మార్జిన్లు సరిగా లేక ఒక వాహనం వస్తే మరొక వాహనం కిందకు దిగినప్పుడు దుమ్ము దూళి పెరుగుతున్నాయి. స్టోన్ క్రషర్సునుంచి భారీగా దుమ్ము వెదజల్లుతోంది. పేరేచర్లలో ఈ సమస్య ఎక్కువగా ఉంది.

గుంటూరులో రెండున్నర

▸ 2లో


దుక్కులు దున్నుతున్న మంత్రి అంబటి రాంబాబు, జెసి శ్యామ్ ప్రసాద్ తదితరులు

7న కృష్ణా డెల్టాకు సాగునీరు

- జూన్ చివరి నాటికి సాగర్ ఆయకట్టుకు విడుదల
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ఏరువాక పౌర్ణమి సందర్భంగా ధూళిపాళ్లలో దుక్కి..

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

కృష్ణా డెల్టాకు జూన్ 7న, సాగర్ ఆయకట్టుకు జూన్ చివరి నాటికి సాగునీరు విడుదల చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రకటించారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలో ఆదివారం ఏర్పాటు చేసిన ఏరువాక కార్యక్రమంలో మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ పాల్గొని పొలంలో దుక్కులు దున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ వర్షపు నీటిని వృథా కానీయకుండా, సముద్రంలో కలవనీయకుండా రైతులకు సిరులు కురిపించేందుకే నాటి సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞం ప్రారంభించారని చెప్పారు. ఇందులో భాగంగా పోలవరం ప్రాజెక్టుకు ఆయన శంకుస్థాపన చేస్తే ఆయన తనయుడు జగన్మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని అన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ముందస్తుగానే సాగునీరు అందిస్తున్నామని చెప్పారు. చంద్రగిరి ఏసురత్నం

▸ 2లో


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాధాకృష్ణ, ఇతర నాయకులు

కౌలురైతుల సమస్యలపై పాదయాత్ర, జీపు జాతాలు

పోస్టర్ ఆవిష్కరణలో కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ

ప్రజాశక్తి-గుంటూరు

భూ యజమానితో సంబంధం లేకుండా ప్రభుత్వమే నేరుగా కౌలు రైతులను గుర్తించి, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10, 11, 12 తేదీల్లో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ తెలిపారు. పాదయాత్రకు ముందుగా ఈనెల 7వ తేదీ నుంచి నెల్లూరు నుంచి జీతాపు జాతా ప్రారంభం అవుతుందన్నారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక బ్రాడీపేటలోని సంఘ కార్యాలయంలో ఆదివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ జీపు జాతా 8, 9, 10 తేదీల్లో పల్నాడు, గుంటూరు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తుందన్నారు. పాదయాత్ర చివరిరోజైన 12వ తేదీన విజయవాడ నుంచి మంగళగిరి ఆటోనగర్ వద్ద ఉన్న సిసిఎల్ఎ ఆఫీసు వద్దకు చేరుకుంటుందన్నారు. భూ యజమాని సంతకం చేయాలని నిబంధన కౌలు రైతుల జీవితాలకు శాపంగా మారిందని, దీనివలన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు రావట్లేదని, గుర్తింపు కార్డులు రాకపోవడంతో రైతు భరోసా,

▸ 2లో

గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు

- సమర్థవంతంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు
- విలేజి క్లినిక్‌లలో మహిళలకు ఎంఎల్‌హెచ్‌లతో చికిత్స
- ప్రజాశక్తితో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి శ్రావణ్‌బాబు

8లో

రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఘటనలు

3లో


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్సీ తలశిల రఘురాం, పల్నాడు కలెక్టర్ ఎల్.శివశంకర్

12న పల్నాడు జిల్లాకు ముఖ్యమంత్రి

- జెవికె కిట్ల పంపిణీకి ప్రారంభోత్సవం
- కృష్ణానదిపై భారీ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

వార్త మెయిన్‌లో

వెబ్ ఆప్షన్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

2పేజీ



7న కృష్ణా డెల్టాకు సాగునీరు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ మిర్చి యార్డులోనే గతేడాది రూ.805 కోట్ల వ్యాపార కార్యకలాపాలు జరిగాయన్నారు. డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ భూమిని నమ్ముకున్న రైతు ప్రకృతితో మమేకమవుతాడన్నారు. వ్యవసాయ అధికారులు కౌలు రైతులకు న్యాయం చేయాలని సూచించారు. పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ మాట్లాడుతూ రైతులందరికీ ఆర్బికేల ద్వారా విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ కుటుంబంలో పుట్టిన సాగుకు దూరంగానే ఉన్నామని, అయినా రైతు సమస్యలు అర్థం చేసుకొని అసెంబ్లీలో వారి సమస్యల పరిష్కారం కోసం చర్చించానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఎన్.రాజనారాయణ, నాయకులు సిహెచ్.సాంబశివరావు, పి.సూరిబాబు, సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.బాబురావు, డాక్టర్ నాగభూషణ్‌రెడ్డి, గీతాహసంతి, కె.విజయభాస్కరరెడ్డి, ఎంపీపీ వై.జైబూన్ బి, సర్పంచ్ మహాలక్ష్మి, ఉప సర్పంచ్ కె.లక్ష్మి, ఎంపీటీసీ వీరమ్మ, ఏపూరి శ్రీనివాసరావు, బి.రాఘవరెడ్డి, అచ్యుత శివ, ప్రసాద్, జైపాల్ పాల్గొన్నారు.

కౌలురైతుల సమస్యలపై పాదయాత్ర, జీపు జాతాలు

(మొదటి పేజీ తరువాయి)

పంట రుణాలు, పంట నష్టపరిహారాలు, పంటల బీమా కౌలు రైతులకు దక్కట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవ సాగుదారులైన కౌలు రైతులను విస్మరించడం తగదని, వీరంతా పంటలు పండించే అట్టడుగు సామాజిక వర్గాలకు చెందిన వారని, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించి వారిని ఆదుకోవాలని కోరారు. సంఘం జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ భూ యజమానితో ఒప్పందం చేసుకోవడం వల్ల బ్యాంకులు కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వడానికి ముందుకు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేసిందని, కానీ వాస్తవంగా భూ యజమానులకే బ్యాంకులు పంట రుణాలు ఇస్తున్నాయని అన్నారు. కార్డు పొందినప్పటికీ పంట రుణాలు మాత్రం కౌలు రైతులకు ఇవ్వట్లేదన్నారు. సిసిఎల్ఎ చట్టంలో మార్పులు చేయాలని, ప్రతి గ్రామంలోనూ కౌలు రైతులతో సంతకాలు సేకరిస్తున్నామని అన్నారు. దాదాపు కోటి మంది కౌలు రైతులకు సంబంధించిన విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం తగదని అన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో జీపు జాతా, పాదయాత్రలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు బి.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శివసాంబిరెడ్డి, సిఐటియు నాయకులు షేక్ మస్తాన్‌వలి, డి.రమేష్‌బాబు, జె.రామారావు, ఆది నికల్సన్, హనుమంతరావు, ఆదిశేషు పాల్గొన్నారు.

వెబ్ ఆప్షన్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించి జూన్ 5 నుంచి 8వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్లు పెట్టుకునే విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ తెలిపారు. బదిలీలు, ప్రమోషన్ల కౌన్సెలింగ్, ఆప్షన్లపై యుటిఎఫ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వెబ్ ఆప్షన్ ఇచ్చేటప్పుడు ఉపాధ్యాయులు ఖాళీల లిస్టులు ముందుగా సేకరించి, కోరుకోవాల్సిన పాఠశాలలను వరుస క్రమంలో గుర్తించుకునే కసరత్తు చేయాలని తెలిపారు. ప్రమోషన్ కోరుకొన్న వారి పాఠశాల క్లియర్ వేకెన్సీగా చూపుతారని తెలిపారు. ఆప్షన్ల కసరత్తు చేసేటప్పుడు పొరపాటుగా నెట్ ఆగిపోయినా అప్పటి వరకూ పెట్టిన పాఠశాలలు సేవ్ అవుతాయని పేర్కొన్నారు. ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకున్న తర్వాతే సబ్మిట్ చేయాలని సూచించారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఖాళీలు, వాటి దూరాలు అన్నీ సమగ్రంగా తెలుసుకోవాలన్నారు. ఎం.కళాధర్ మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా ఒక యూనిట్‌గా ప్రమోషన్లు, బదిలీలు జరుగుతాయని, 57 మండలాల్లో ఉన్న ఖాళీలను, వాటిపై పూర్తి అవగాహనకు బ్రాడీపేట 2/6లోని యుటిఎఫ్ కార్యాలయలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. వెబ్ ఆప్షన్ల కోసం ఈనెల 5వ తేదీన కార్యాలయంలో ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు కె.విజయ్ భాస్కర్, జిల్లా కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

డిమాండ్ల సాధనకు సమరశీల పోరాటం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు

రాష్ట్రంలోని కౌలు రైతుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్‌చేస్తూ ఈనెలలో 5 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనా కార్యక్రమాలను చేపడుతున్నామని ఎపి కౌలు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు వెల్లడించారు. ఈనెల 5 నుంచి ప్రారంభం కానున్న పాదయాత్రలు, 7 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న జీపు యాత్రలను జయప్రదం చేయాలని కోరుతూ రూపొందించిన కరపత్రాలను తోట్లవల్లూరు మండలం వల్లూరు పాలెం గ్రామంలో ఎపి కౌలు రైతుసంఘం నాయకులు పర్యటించి కౌలు రైతులకు పంపిణీచేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ కౌలు రైతు చట్టాన్ని (సిసిఆర్సి) సవరించాలని,కౌలు కార్డు పై భూయజమాని సంతకం తొలగించాలని డిమాండ్‌చేస్తూ కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే పాదయాత్రలో కౌలు రైతులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గతంలో రుణార్హత కార్డులు, సాగుధ్రువీకరణ పత్రాలు వచ్చి కొద్ది మోతాదులో కౌలు రైతులకు ఉపయోగపడ్డాయన్నారు. వైసిపి ప్రభుత్వం గతంలో ఉన్న కౌలు చట్టాలను ఒక్క కలం పోటుతో రద్దు చేసిందని విమర్శించారు. పైగా భూయజమాని సంతకం ఉంటేనే కౌలు కార్డులు (సిసిఆర్సి) ఇస్తామనే నిబంధన చేర్చిందన్నారు. దీనితో భూయజమానులు కౌలు కార్డులు ఇవ్వడానికి, సంతకం పెట్టడానికి ముందుకు రావడం లేదన్నారు. ఫలితంగా కౌలు రైతులు సిసీఆర్ కార్డులు పొందలేకపోతున్నారన్నారు. కార్డు లేకపోతే పంటల రుణాలు, పంటల భీమా, నష్టపరిహారాలు, రైతుభరోసా ఏమీ రావన్నారు, ఈ-క్రాపింగ్ కూడా చేయడంలేదన్నారు. సిసిఆర్ కార్డు రాకపోతే ప్రభుత్వం నుండి కౌలు రైతులకు చిల్లిగవ్వ కూడా రాదన్నారు. గ్రామ సభల ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రతి కౌలు రైతుకు 'స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ష్యూరిటీ లేకుండా పంట రుణాలు ఇవ్వాలనీ, పంటల భీమా, నష్టపరిహారాలు, పంటను అమ్ముకునే అవకాశం కల్పించాలనీ, పెరిగిన ధరల రీత్యా కౌలు రైతులకు రైతుభరోసాను రూ.25 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈనెల తోట్లవల్లూరులో సాయంత్రం 5 గంటలకు సభ ప్రారంభమవుతుందని అక్కడి నుంచి 11న వల్లూరుపాలెం నుండి ప్రకాశం బ్యారేజీ మీదుగా 12న మంగళగిరిలోని సీసీఎల్‌ఏ కార్యాలయం వరకూ యాత్ర జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలురైతుసంఘం మండల నాయకులు లెనిన్, నాగేశ్వరావు, పెద్దబ్బాయి, యేసు, కోట శేషగిరిరావు, తుమ్మల వెంకటేశ్వరరావు, తూమాటి రాజు తదితరులు పాల్గొన్నారు.



కౌలు రైతు చట్టాన్ని సవరించాల్సిందే

కలెక్టరేట్ (కృష్ణా) : కౌలు రైతు చట్టాన్ని (సిసిఆర్‌సి) సవరించాలని, కౌలుకార్డుపై భూయజమాని సంతకం తొలగించాలని డిమాండ్‌చేస్తూ కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే పాదయాత్రలో కౌలు రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాల కౌలురైతు సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక జ్యోతిరావు పూలే విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డు లేకపోతే పంటల రుణాలు, పంటల భీమా, నష్ట పరిహారాలు, రైతు భరోసా ఏమీ రావటం లేదన్నారు. కౌలు వ్యవసాయం భారమైనా వేరే వృత్తుల్లోకి వెళ్ళలేక పాడిగేదెలకు, పశువులకు కాస్త గడ్డి అయినా దొరుకుతుందనే ఆశతో కౌలు వ్యవసాయంలోనే ఉండి పోయారన్నారు. వ్యవసాయ అప్పులు పెరగడం, ప్రభుత్వాల నుండి భరోసా లభించక కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. అనంతరం కౌలురైతుసంఘం పాదయాత్ర, జీపు యాత్రల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరి శెట్టి నాగేశ్వరరావు, కె.వి పి ఎస్,జిల్లా కార్యదర్శి,సి హెచ్,రాజేష్,సి ఐ టి యు పట్టణ కార్యదర్శి సి హెచ్ జయరావు పాల్గొన్నారు.

చట్టసభల్లో ఇప్పటికీ ప్రాతినిధ్యం లేదు

నూర్‌బాషా దూదేకులు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పీర్‌మహమ్మద్

ప్రజాశక్తి - గుంటూరు



నూర్‌బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా గుంటూరుకు చెందిన కె.పీర్ మహమ్మద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరులోని ఓ హోటల్లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించగా రాష్ట్రంలోని 26 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, ముఖ్య నాయకుల హాజరై పీర్ మహమ్మద్‌ను రాష్ట్ర అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగుల్ మీరా ఆంధ్రప్రదేశ్ దూదేకుల ఫెడరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పి.బాబన్, ఆంధ్రప్రదేశ్ అధికార భాష సంఘం సభ్యురాలు డాక్టర్ మస్తానమ్మ, టిడిపి బీసీ సాధికారిక సమితి రాష్ట్ర కన్వీనర్ సుభహాన్ హాజరయ్యారు. పీర్ మహమ్మద్ మాట్లాడుతూ దూదేకులు ఇప్పటికీ చట్టసభల్లో ప్రవేశించకపోవడం దారుణమన్నారు. తమకు రాజకీయ పార్టీలన్నీ మద్దతుగా నిలవాలని కోరారు. రాష్ట్రమంతా పర్యటించి 26 జిల్లాల్లో సంఘం ఆధ్వర్యంలో దుదేకుల జనగణన చేపట్టి, దూదేకుల మహాసభలు నిర్వహిస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు తమకు ప్రాధాన్యం ఇచ్చేలా కృషి చేస్తామన్నారు. విద్యాపరంగా, రాజకీయ పరంగా మైనార్టీలకు కేటాయించే అన్ని ప్రాధాన్యతల్లో దూదేకులకు జనాభా ప్రతిపాదికగా న్యాయం కోసం పోరాడతామన్నారు.

పెరుగుతున్న వాయు కాలుష్యం

(మొదటి పేజీ తరువాయి)

లక్షల ద్విచక్ర వాహనాలు, 30 వేల ఆటోలు, మరో 10 వేల భారీ వాహనాలు ఉన్నాయి. వీటి ద్వారా వస్తున్న కర్బన్ ఉద్గారాలు వల్ల కాలుష్యం పెరుగుతోంది. గుంటూరులో వాహన కాలుష్యం ప్రమాదకర స్థాయిలో ఉంటోంది. కాలం చెల్లిన వాహనాలు కూడా చాలా తిరుగుతున్నాయి. 15 ఏళ్ల తరువాత ఏ వాహనం అయినా నడపకూడదని నిబంధనలున్నా చాలామంది 30 ఏళ్లపాటు నడుపుతున్నవారు కూడా లేకపోలేదు. పాత వాహనాలనుంచి వెదజల్లుతున్న పొగలో దూళి కణాలు ఎక్కువగా ఉంటున్నాయి.

గుంటూరు పరిసరాల్లో పొలాల్లో వ్యవసాయ ఉత్పుత్తుల విక్రయం ద్వారా వచ్చే వ్యర్థాలను కూడా పొలాల్లోనే తగులబెడుతున్నారు. వీటి ద్వారా వచ్చే పొగకూడా పరిసర ప్రాంతాలకు కాలుష్యం వెదజల్లుతోంది. సూక్ష్మ దూళి కణాలు, అతిసూక్ష్మ దూళి కణాల వల్ల మహిళలు, చిన్నారులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. వీరు వేర్వేరు అవసరాల నిమిత్తం బయటకు వచ్చినప్పుడు, ప్రయాణాల్లోనూ ఈ కాలుష్యం బారిన పడుతున్నారు. మొత్తంగా వాహనాలు,మిర్చి ఆధారిత పరిశ్రమలు, పంట వ్యర్థాలతో పాటు ఆయా మున్సిపాల్టీల నుంచి వచ్చే వ్యర్థపదార్థాలను పట్టణాల శివారు ప్రాంతాల్లో తగులబెట్టిన సందర్భంలో వస్తున్న పొగవల్ల కూడా గాలిలో కాలుష్యం అధికంగా ఉంటోంది. గుంటూరులోని కాలుష్య నియంత్రణ మండలి పరిమితమైన ఉద్యోగులతో మొక్కుబడిగా విధులు నిర్వహిస్తోంది. సంబంధిత కాలుష్య కారకులపై ఫిర్యాదులు వస్తే వారికి నోటీసులిచ్చి మమ అనిపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి



దాచేపల్లి పట్టణ శివారు ప్రాంతం లోని దావత్ రెస్టారెంట్ వద్ద సిమెంట్ లారీని ఢీ కొట్టిన ట్రావెల్స్ బస్సు



జాకీర్‌హుస్సేన్ నగర్ సమీపంలోని ప్రమాద ఘటనా స్థలంలో అనురాధ మృతదేహం









పెదకాకాని పరిధిలో వెంగళరావునగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సంఘటనా స్థలంలో చిత్రాలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల/దాచేపల్లి

నిద్రమత్తు నిర్లక్ష్యం నిండు ప్రాణాలు బలైపోతున్నాయి. ఇటీవల దాచేపల్లి మండలంలోని దామరచర్ల గ్రామ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదు గురు మృతి చెందిన ఘటన మరవకముందో మరో ప్రమాదంతో దాచేపల్లి ప్రజలు ఉలిక్కిపడ్డారు. దాచేపల్లి పట్టణ శివారు ప్రాంతం లోని దావత్ రెస్టారెంట్ వద్ద ఆగి ఉన్న సిమెంట్ లారీని, కావేరి ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. దాచేపల్లి పట్టణ సిఐ బిలాలుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుండి కందుకూరు వెళ్తున్న కావేరి ట్రావెల్స్ బస్సు దాచేపల్లి పట్టణ శివారు వద్ద ఆగి ఉన్న సిమెంట్ లారీనీ తెల్లవారు జామున ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో క్షతగాత్రులను గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని, గాయపడిన వారిలో చికిత్స పొందుతూ గడ్డం గోపి(25) మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణం కావేరి ట్రావెల్స్ బస్సు డ్రైవరు నిద్ర మత్తులో ఉండటమే అని తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తులో బస్సును నడిపినట్లు ప్రయాణికులు తెలిపారు. బస్సు వేగంగా లారీనీ ఢీకొట్టడంతో బస్సు ముందు భాగం మెత్తం నుజ్జు నుజ్జయిందని, ప్రమాద ఘట నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునటు పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన టిప్పర్

ప్రజాశక్తి-తెనాలి

లారీ డ్రైవర్ నిర్లక్ష్యం నిండు ప్రాణాన్ని బలిగొంది. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిని ద్విచక్రవాహనంపై వైద్యుని వద్దకు తీసుకు వెళుతుండగా అడ్డూ లదుపూ లేని వేగంతో ప్రయాణిస్తున్న టిప్పర్ బైక్‌ను వెనుక నుంచి ఢీకొంది. ఘటనలో తల్లి అక్కడికక్కడే మృతి చెందగా కుమార్డు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం పెదకాకాని మండలం వెంకటకృష్ణాపురానికి చెందిన అమ్మిశెట్టి అనురాధ (44) స్వల్ప అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో కుమారుడు మణికంఠ ఆదివారం ఆమెను చికిత్స నిమిత్తం కొలకలూరులో ఆర్ఎంపి వద్దకు బైక్‌పై తీసుకువెళు తున్నాడు. జాకీర్‌హుస్సేన్‌నగర్ దాటగానే వెనుక నుంచి అతివేగంతో వచ్చిన టిప్పర్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో మణికంఠ రోడ్డుకు ఎడమవైపునకు పడిపోగా, అనురాధ రోడ్డుపై పడిపోయింది. ఆమె రెండు కాళ్ళ మీదకు లారీ చక్రాలు ఎక్కడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కళ్ళ ముందే తల్లి మృత్యువాత పడటంతో కుమారుడి రోదన వర్ణనాతీతం. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి, లారీని సీజ్ చేశారు. అనురాధ మృత దేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని

పెదకాకాని పరిధిలో వెంగళరావునగర్ ఐటీసీ వద్ద 3వ తేదీన ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మంగళగిరికి చెందిన మిర్యాల వంశీ (26) ప్లంబర్ పని చేస్తుంటాడు. భార్య దేవనిషి (23) బిఎస్సీ నర్సింగ్ 3వ సం ఫైనల్ పరీక్షలు రాసి గుంటూరు నుండి మంగళగిరి వెళ్తుండగా వెనుక నుండి వచ్చిన లారీ, వీరు ప్రయాణిస్తున్న మోటార్ వెహికల్ ఢీ కొట్టింది. దేవనిషి సంఘటనాస్థలంలో మృతి చెందింది. కొనఊపిరితో ఉన్న వంశీని 108 వాహనంలో జిజిహెచ్‌కు తరలించిన కొన్ని నిమిషాలకే ప్రాణాలు విడిచాడు. దేవనిషి తండ్రి మాట్లాడుతూ నిర్లక్ష్యంగా లారీ నడిపి తన ఒక్కగానొక కుమార్తె,అల్లుడి మతికి కారణమైన డ్రైవర్‌పై తగినచర్యలు తీసుకోవాలని పెదకాకాని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటీకరణ విధానాల వల్లే ప్రమాదాలు: సిపిఎం

ప్రజాశక్తి-బాపట్ల

ఒడిస్సా రాష్ట్రంలో బాలాసోర్ వద్ద సంభవించిన రైలు ప్రమాదంలో చనిపోయిన ప్రయాణికులకు ఆదివారం బాపట్ల రైల్వే స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఎన్నడూ లేని రీతిలో జరిగిన అత్యంత ఘోరమైన రైలు ప్రమాదంలో చనిపోయిన ప్రయాణికులను కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నామని అన్నారు. గాయపడిన వారికి సత్వరమే వైద్య సహాయం అందేలా చూడడం ద్వారా మృతుల సంఖ్య పెరగకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. మూడు రైళ్లు ఢీకొన్న ప్రమాదానికి కారణాలు ఏంటి అనేది తెలియడం కోసం సమగ్ర దర్యాప్తు చేయించాలని సిపిఎం తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటీకరణ విధానాలు వల్లే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రయాణికుల భద్రతను గాలికి వదిలి,లాభాలు కోసం ప్రయత్నం చేయటం



రైలు ప్రమాదంలో మరణించిన వారికి నివాళి అర్పిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నేతలు

దురదృష్టకరమని అన్నారు. కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్న ఆయన సొంత రాష్ట్రంలోనే ఇటువంటి ఘటన జరగటం దురదృష్టకరమని అన్నారు. రైల్వేల ప్రైవేటీకరణ కాకుండా ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కుటుంబాలకు రూ.20 లక్షలు, గాయపడిన వారికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ మజుందార్, నాయకులు ఎన్ కోటేశ్వరావు, నాగేశ్వరరావు, భాస్కరరావు, ప్రసాద్, సుభాషిణి, జ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.

నదిలో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి-అమరావతి



అమరేశ్వర స్నాన ఘాట్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మతదేహాన్ని గుర్తించిన స్థానికులు అమరావతి పోలీసులకు సమాచారం అందించారు. అమరావతి సీఐ బ్రహ్మం, ఎస్సై కోటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం కోసం అమరావతి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వయసు సుమారు 55 ఏళ్లు ఉంటాయని, తెల్లని గడ్డంతో ఉన్నాడని అన్నారు. ఆచూకీ తెలిసినవారు 9440796217, 9440796266 నంబర్లకు సమాచారం అందించాలని వారు తెలిపారు.

పేకాటాడుతున్న ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని కంభంపాడులో పేకాట ఆడుతున్న ముగ్గురిని ఆదివారం అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని, కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు తమకు సమాచారం అందినట్లు చెప్పారు. వారి వద్ద నుండి రూ.7,260 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మండలంలో ఎక్కడైనా ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తమకు తెలియచేయాలని ,వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

రైతు సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-నరసరావుపేట

కేంద్ర,రాష్ట్ర ప్రభు త్వాలు అను సరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో రైతులు నానాటికి ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోతున్నారని, రైతుల ఆత్మ హత్యలు పెరిగి పోతున్నాయని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి రైతు సమ్మేళనం ఆహ్వాన కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమా వేశానికి జిల్లా రైతు సంఘం అధ్యక్షులు తాళ్లూరి బాబురావు అధ్యక్షత వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 13, 14, 15 తేదీల్లో నరసరావుపేట పట్టణంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు సమ్మేళనం సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్య దర్శి మారుతి వరప్రసాద్ మాట్లాడారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రాము, ఆహ్వాన సం ఘం గౌరవ అధ్యక్షులు సీజే ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

రైతులంతా సుభిక్షంగా ఉండాలి

ప్రజాశక్తి-కర్లపాలెం

రైతులందరికీ ఏరువాక పౌర్ణమి అతి పెద్ద పండుగ అని, భూమిని, పశువులను, వ్యవసాయ పనిముట్లను పూజించే పండుగ ఇది అని బాపట్ల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. ఆదివారం కర్లపాలెం మండల పార్టీ కార్యాలయం నుంచి ట్రాక్టర్‌లతో భారీ ర్యాలీగా వెళ్లి పెద గొల్లపాలెంలోని పమిడి భాస్కరరావు పొలంలో పంట పొలాల్లో దుక్కి దున్ని ఏరువాక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు చంద్రన్న పాలనలో వ్యవసాయాన్ని పండుగ చేసి లాభసాటి చేయగా, ఈ నాలుగేళ్ల పాలనలో అన్నదాతలు అప్పుల పాలయ్యారని అన్నారు.

నట్టేట ముంచుతున్న నకిలీలు

- కల్తీలు, నాణ్యతలేమి విత్తనాలు అంటున్న రైతులు
- కాదంటున్న అధికారులు, కంపెనీలు
- నష్టపోతున్న నియోజకవర్గ రైతులు

ప్రజాశక్తి-పెదకూరపాడు

రైతుల విత్తన హక్కులను కాపాడటం కోసం ఘనమైన చట్టాలు ఉన్నాయి. ఆచరణలో మాత్రం కంపెనీలకు చుట్టాలుగా మారాయని విమర్శలు ఉన్నాయి. దీంతో, రైతులకు నష్టపరిహారం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందాన నెలకొని ఉంది. రైతుల కోసం స్థాపించిన ఇన్సూరెన్స్ కంపెనీ నేతి బీరకాయలో నెయ్యి చందాన మారాయి.పల్నాడు జిల్లాలో పత్తి,మిరప,వరి ప్రధానంగా పండిస్తున్నారు. మార్కెట్లో వచ్చిన కొత్త రకం విత్తనాలను పెదకూరపాడు నియోజకవర్గంలో ప్రవేశపెడతారు. వాటి దిగుబడి చూడటం. వాటిని మార్కెట్ చేసుకోవడం కంపెనీలకు ఆనవాయితీగా ఉంది. ఒక్కొక్కసారి ఎటువంటి పరిశీలన చేయకుండా నేరుగా రైతులను విత్తనాలు అమ్మడం కంపెనీలు చేస్తున్నారు. దీంతో పంట రాకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చట్టంలో ఉన్న లొసుగులను ఆసరా చేసుకొని కంపెనీలు నష్టపరిహారం ఇవ్వకుండా కాలయాపన చేయడం, దాటవేసే ధోరణిని ప్రదర్శిస్తున్నాయి. ఈ కంపెనీలకు అధికార పార్టీ పలు సందర్భాల్లో వత్తాసు పలుకుతున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో గత మూడేళ్ల నుంచి రకరకాల కంపెనీలు రైతులను నట్టేట ముంచాయి. అచ్చంపేట మండలంలోని తాళ్ళచెరువు లో పత్తి విత్తనాలు, క్రోసూరు మండలంలోని పెరికపాడు, దొడ్లేరు ఆవులువారిపాలెం, క్రోసూరు మండలంలో ఎర్రపాలెం, రుద్రవరం, బయ్యవరం, అనంతవరం, క్రోసూరు వరి విత్తనాలు, పెదకూరపాడులో రెండేళ్ల క్రితం మిరప విత్తనాలు నాణ్యత లేనివి, కల్తీలు అందజేశారు. పెదకూరపాడులో నాలుగు నెలలు రైతులు పోరాడి నష్టపరిహారం కంపెనీ నుంచి సాధించుకున్నారు. మిగతా మూడు చోట్ల పోరాటాలు అంతంత మాత్రమే జరిగాయి. రాజకీయ నాయకులపై ఆధారపడ్డారు. ఇప్పటికీ నష్టపరిహారం కోసం కంపెనీల చుట్టూ, కోర్టుల చుట్టూ, అధికారుల చుట్టూ, షాపుల చుట్టూ రైతులు తిరుగుతున్నారు.

ఎకరానికి పదివేల నష్టం: ఎం.రామారావు



కల్తీ విత్తనాలతో కూడిన వరి వేసి నష్టపోయినట్లు క్రోసూరు మండలంలోని ఎర్రబాలెం గ్రామానికి చెందిన ఏపూరి రామారావు అన్నారు. ఎకరానికి పదివేల రూపాయలు నష్టపోయినట్లు చెప్పారు. రెండున్నర ఎకరాల్లో అన్నపూర్ణ సీడ్స్ వారి బీపీటీ గడిచిన సంవత్సరంలో పంట చేశామన్నారు. ఎకరం కౌలు, సొంతం ఒక ఎకరం 50 సెంట్లలో వేశామన్నారు. క్రోసూరు లోని వ్యవసాయ సొసైటీలో విత్తనాలు కొనుగోలు చేశామన్నారు.

ఇంతవరకూ నష్టపరిహారం రాలేదు : అంతోన్ రెడ్డి



ప్రతి ఎకరానికి రూ.40,000 నష్టం వచ్చిందని అచ్చంపేట మండలంలోని తాళ్ళచెరువు గ్రామానికి చెందిన అంతోన్ రెడ్డి అన్నారు. గంగా కావేరి సీడ్స్ కంపెనీకి చెందిన సిక్సర్ అనే పత్తి రకం వేశామన్నారు. క్వింటాలు మాత్రమే దిగుబడి వచ్చిందన్నారు. అధికారులు వచ్చారు. నష్టపరిహారం ఇప్పిస్తామన్నారు కానీ ఇంతవరకు ఎటువంటి ఫలితం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నమ్మించి మోసం చేశారు :వెంకటేశ్వర్లు



అధిక దిగుబడి వస్తుందని, బాగా రేటు అమ్ముకోవచ్చని నమ్మబలికి నాసిరకం వరి విత్తనాల వేయడం వల్ల వల్ల ఎకరానికి 40 వేల రూపాయలు నష్టం వచ్చిందని క్రోసూరు మండలంలోని పెరికపాడు గ్రామానికి చెందిన సాగి వెంకటేశ్వర్లు అన్నారు తాను రెండు ఎకరాల్లో ఎన్ డి ఎల్ ఆర్ 7 పేరుతో ఇచ్చిన వరి విత్తనాలను సాగు చేశామన్నారు. కేవలం ఎకరానికి ఏడు బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చిందన్నారు.

కల్తీలకు అడ్డా మారింది

కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు టి.హనుమంతరావు



కల్తీలకు,నకిలీ విత్తనాలకు, నాణ్యత లేమికి అడ్డా గా పెదకూరపాడు నియోజకవర్గం మారిందని పల్నాడు జిల్లా కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు తిమ్మిశెట్టి హనుమంతరావు విమర్శించారు. గడిచిన సంవత్సరంలో తాళ్ల చెరువులో సిక్సర్ పత్తి విత్తనాలు 600 ఎకరాల్లో రైతులు సాగు చేశారన్నారు. నాణ్యతలేని విత్తనాల వల్ల మూడు నుంచి నాలుగు క్వింటాలు మాత్రమే దిగుబడి వచ్చిందన్నారు. వీరిలో ఎక్కువ మంది కౌలు రైతులు ఉన్నారన్నారు. ముందస్తుగానే కౌలు చెల్లించడం వల్ల ఎకరానికి 30 వేల నుంచి 40 వేల వరకు నష్టం వచ్చిందని చెప్పారు. గడిచిన



ఎన్‌డిఎల్ ఆర్ సెవెన్ విత్తన బ్యాగ్, 7తో ఇచ్చిన మరొక బ్యాగ్

సంవత్సరంలో ఎర్రబాలెంలో 82 ఎకరాల్లో అన్నపూర్ణ సీడ్స్ కంపెనీ వరి విత్తనాలు సాగు చేశారు. వారిలో 30 మంది రైతులు ఉన్నారు. ఇవి క్రోసూరు వ్యవసాయ సొసైటీలో కొనుగోలు చేశారు. తగ్గిన దిగుబడికి నష్టపరిహారం ఇస్తామని చెప్పి మొహం చాటేశారన్నారు. దొడ్లేరు, ఆవులు వారి పాలెం, పెరికపాడు గ్రామంలో 2021 బి22 సీజన్లో వరి విత్తనం 400 ఎకరాల్లో 120 మంది సాగు చేశారు. ఐదు నుండి పది బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారు. ఈ విత్తనాలు పిడుగురాళ్ల, బెల్లంకొండ షాపు ల్లో కొనుగోలు చేసినట్లు వివరించారు. నష్టపరిహారం కోసం రైతులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలను వెంటనే అందించాలని కోరారు. నష్టపోయిన రైతులకి వెంటనే నష్టపరిహారం వచ్చేలా చేయాలని డిమాండ్ చేశారు.

అటువంటిదేమీ లేదు: ఎడిఎ

నకిలీ విత్తనాలు,కల్తీ విత్తనాలు, నాణ్యతలేని నాసిరకం విత్తనాలు తన పరిధిలో ఏమీ లేవని క్రోసూరు ఎడిఎ హనుమంతరావు అన్నారు. కొత్త విత్తనాలు వేసుకునేటప్పుడు అవి మన పొలానికి అనుకూలంగా ఉంటాయా లేదా అని తెలుసుకొని వాడుకోవాలన్నారు. రైతులకు ఆ నాలెడ్జి లేకపోవడం వల్లే నష్టపోతున్నారన్నారు. ఎర్రబాలెంలోని వరి విత్తనాలపై రిపోర్టును కమిటీకి పంపామన్నారు. తాళ్ళ చెరువులో పత్తి విత్తనాలు సమస్య నాణ్యతాపరంగా లోపం లేదని శాస్త్రవేత్తలు నుండి రిపోర్టు వచ్చింది అన్నారు. రికార్డు ప్రకారం నష్టపరిహారం ఇవ్వలేమని కంపెనీ తెలిపిందన్నారు. గ్రామాభివృద్ధి పేరుతో 15 నుంచి 20 లక్షల రూపాయలు ఇవ్వటానికి ముందుకు వచ్చారన్నారు. పెరికపాడులో వరి వేసిన రైతులు యాజమాన్య లోపం వల్లే దిగుబడి రాలేదని శాస్త్రవేత్తల రిపోర్టు వచ్చిందన్నారు. విత్తనాలు తీసుకునేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన రైతులను కోరారు.



నాగార్జున కొండలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండ ను ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శించారు. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండ కు నాగసిరి, శాంతి సిరి లాంచీలలో కొండకు వెళ్లిన పర్యాటకులు అక్కడ మ్యూజియంలో ఉన్న బుద్ధిని ప్రతిమలు,రాతి పనిముట్లు, మట్టి కుండలు,9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం,అశ్వమేధ శాల, స్నానాల గట్టు చూసి తన్మయం చెందారు. అనంతరం అనుపు లోని యాంపి స్టేడియం, అశ్వమేధ యగ్నశాల, శ్రీ రంగనాథస్వామి దేవాలయం, తదనంతరం 60 అడుగుల ఎత్తునుండి జాలువారే ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు.ఆదివారం లాంచీల ద్వారా పర్యాటక శాఖ కు రూ.45 వేల రూపాయల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.



రూ.10 వేలు చెక్కును అందజేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ జాన్‌సైదా

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆర్థికసాయం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మండల పరిధిలో పోతవరంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న షేక్ హఫీజ్‌ను జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్ సైదా ఆదివారం పరామర్శించారు. షేక్ హఫీజ్ ఇంటికి వెళ్లి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందచేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, మానుకొండ విజయ భాస్కర్‌రెడ్డి, జమ్మలమడక ఆదిబాబు కొమ్మనబోయిన రమేష్, నేలం యేసు రాజు పాల్గొన్నారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తహశీల్దార్ ఆర్‌వి రమణ నాయక్

ప్రజాశక్తి - నరసరావుపేట

ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటుతున్న నేపథ్యంలో వడగాలులు తీవ్రంగా పెరిగిపోతున్నాయని, జాగ్రత్తలు తీసుకోవాలని నరస రావుపేట మండల తహశీల్దార్ ఆర్ వి రమణ నాయక్ సూచిం చారు. ఆదివారం ఆయన ప్రజాశక్తి తో మాట్లాడుతూ పొలం పనులకు వెళ్లే రైతులు కూలీలు ఉదయం 9 గంటలకల్లా పనులు ముగించుకొని ఇంటికి చేరాలన్నారు. పశువుల కాపరులు కూడా ఉదయం, సాయంత్రం వేళల్లో పశువులను మేతకు తోలుకెళ్ళాలని సూచించారు. ఒక్కసారిగా పగటి అధిక ఉష్ణోగ్రతలతో సాయంత్రం 7 గంటల వరకు భానుడి ప్రతాపం తగ్గడం లేదన్నారు. వాతా వరణంలో తేమ శాతం తగ్గి, వడగాలుల తీవ్రత పెరిగిందన్నారు. కొన్నిరోజుల క్రితం వర్షాలు పడినప్పటికీ వాతావరణ మార్పులతో విపరీతంగా ఉష్ణోగ్రత పెరిగిపోయిందన్నారు. మరికొన్ని రోజుల పాటు వాతావరణం ఇదే మాదిరి ఉంటుందన్నారు. ప్రజలు ప్రయాణాలు ఏవైనా ఉంటే వాయిదా వేసుకోవాలని ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు బయటికి రావద్దని సూచించారు. తప్పని పరిస్థితుల్లో బయటికి రావాల్సి వస్తే చెవుల, తల, మొహం కప్పి ఉండేలా వస్త్రాలు ధరించాలని, తాగు నీరు, మజ్జిగ వెంట ఉంచుకోవడం మంచిదని సూచించారు.

ఆటల పోటీల్లో ఉత్సాహంగా విద్యార్థులు



సిల్మన్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ..

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలకు విద్యార్థుల నుండి విశేష స్పందన లభిస్తుందని విజ్ఞాన కేంద్రం కార్య నిర్వాహక కన్వీనర్ షేక్ మస్తాన్ వలి అన్నారు. వేసవి శిక్షణ శిబిరాలలో భాగంగా ఆదివారం స్థానిక గుంటూరు రోడ్డులోని సిల్మన్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు పరుగు, కబడ్డీ, తాడులాగడం వంటి పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా మస్తాన్ వలి మాట్లాడుతూ ఆయా పోటీ లలో విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. ఇప్పటికే పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వ ర్యంలో విద్యార్థులకు అనుభవం కలిగిన ఉపాధ్యాయు లతో స్పోకెన్ ఇంగ్లీష్,గణిత శాస్త్ర, హిందీ ,మెరుగైన చేతిరాత,వ్యాస రచన, సైన్స్ తదితర పాఠ్య సంబంధిత అంశాలపై శిక్షణ ఇచ్చి ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు, ప్రతి ఒక్కరికి నోటు పుస్తకాలు పెన్నులు అందజేశామన్నారు. ఆటల పోటీ లను పర్యవేక్షించిన పిడి ఎం. సైదారావు మాట్లా డుతూ విద్యార్థులు చిన్నతనం నుండే విద్యతో పాటు ఆటపాటలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆటల దిశగా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాల న్నారు. ఆయా ఆటల పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాల ముగింపు సందర్భంగా మంగళవారం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులను కూడా ఆహ్వానిస్తున్నా మన్నారు. కార్యక్రమంలో షేక్ సిలార్ మసూద్. ఎస్ డి ఎం హుస్సేన్ పాల్గొన్నారు.



కబడ్డి ఆడుతున్న విద్యార్థులు

బిజెపి పాలనలో పెరిగిన మతోన్మాదం

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.రఘు

ప్రజాశక్తి - గుంటూరు

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజల మధ్య విభజనను సృష్టిస్తోందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.రఘు అన్నారు. ఆ పార్టీ కార్యకర్తలకు బ్రాడీపేట 2/7లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా తరగతులకు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు ప్రిన్సిపల్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ మేరకు వివరాలను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు వెల్లడించారు. రెండరోజైన ఆదివారం 'మతతత్వ రాజకీయాలు-ప్రతిఘటనా పద్ధతులు' అంశంపై ఆర్.రఘు మాట్లాడుతూ భారత రాజ్యాంగ లౌకిక స్ఫూర్తిని దెబ్బతీసే చర్యలకే కేంద్ర ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. విద్యారంగంలో సిలబస్‌లో ఆశాస్త్రీయమైన అంశాలను ప్రవేశపెట్టి శాస్త్ర సాంకేతిక రంగాలను దెబ్బతీస్తున్నారని, కులాలు, ప్రాంతాలు, మతాల మధ్య గొడువులు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. భారత రాజ్యాంగ లౌకిక స్ఫూర్తిని కాపాడుకునేందుకు అభ్యుదయ వాదులంతా ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి, కె.నళినీకాంత్, ఎం.రవి, ఎస్ఎస్.చెంగయ్య, నాయకులు ఎల్.అరుణ, సుధాకిరణ్ పాల్గొన్నారు.

సర్దుబాటు పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంపు సరికాదు

సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచడం సరికాదని, దీనికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని రామారావు అన్నారు. శిక్షణా తరగతుల అనంతరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు అధ్యక్షతన జిల్లా విస్తృత సమావేశం నిర్వహించగా రామారావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లుల్లో సర్దుబాటు ఛార్జీల పేరుతో యూనిట్‌కు 40పైసలు అదనంగా వసూలు చేస్తోందని, అన్ని వర్గాల ప్రజలపై ఈ భారం పడుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెరిగి ప్రజల జీవన పరిస్థితులు దుర్భరంగా మారుతున్నాయన్నారు. ఇలాంటి స్థితిలో విద్యుత్ ఛార్జీలు పెంచడం సరికాదన్నారు. పసుపు పంటకు రాష్ట్ర ప్రభుత్వం రూ.6850 మద్దతు ధర ప్రకటించగా ప్రైవేటు వ్యాపారులు రూ.5 వేలకే కొంటున్నారని చెప్పారు. అధిక వర్షాలకు ఈ ఏడాది దిగుబడి తగ్గడంతోపాటు పెట్టుబడి ఖర్చులూ పెరిగాయన్నారు. ఈ నేపథ్యంలో పసుపు పంటను ప్రభుత్వమే మద్దతు ధరకు కొనాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, ఏ గ్రామంలో ఉన్న పేదలకు ఆ గ్రామంలోనే ఇళ్ల స్థలాలివ్వాలని, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డు కోసం యజమాని సంతకం చేయాలనే నిబంధనలను తొలిగించాలని కోరారు. కౌలు రైతుల సమస్యలపై ఈ నెల 8, 9 తేదీల్లో జరిగే రాష్ట్ర వ్యాప్త ప్రచార యాత్రలు, పాదయాత్రలను జయప్రదం చేయాలని, చేగువేరా జయంతి సందర్భంగా జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించి సభ నిర్వహించాలని, గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరుతూ తీర్మానాలను సమావేశంలో ఆమోదించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి, ఎన్.భావన్నారాయణ, కె.నళినీకాంత్, ఎం.రవి, ఎస్ఎస్ చెంగయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్.రఘు, పక్కన పాశం రామారావు, ఈమని అప్పారావు

అవి మంత్రాలు కాదు.. ట్రిక్కులే

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద ఉన్న, ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం జన విజ్ఞాన వేదిక, ఐద్వా ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం మూడవరోజు నిర్వహించారు. ఈ శిక్షణా శిబిరంలో రంగు పేపర్లతోవివిధ రకాల పూలు, గ్రీటింగ్ కార్డ్సు తయారీ, బొమ్మలు, న్యూస్ పేపర్‌తో కటింగ్, రకరకాల టోపీలు తయారు చేయుట మొదలగు వాటిల్లో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధి వల్లభాపురపు ప్రసాద్ శిక్షణిచ్చారు. మ్యాజిక్ చేసి చూపిస్తూ, వివిధ పొడవులు కలిగిన తాళ్లను సమానం చేయడం ద్వారా మనమంతా ఒక్కటే అని వివరించారు. కాగితం ముక్కలను చించి, వాటిని దండ లాగా తయారుచేసి ఐకమత్యంగా కలిసి ఉండాలని వివరించారు. కర్పూరాన్ని అరచేతిలో వెలిగిస్తూ, దీని వెనక ఎటువంటి మంత్రాలు, మాయలు లేవని, కేవలం ధైర్యం ఉంటే చాలని జన విజ్ఞాన వేదిక తుళ్లూరు నాయకులు పి.అరుణ్ కుమార్ వివరించారు. చిన్నచిన్న మ్యాజిక్స్ విద్యార్థులకు నేర్పించి, పిల్లలతోనూ చేయించారు. అందులో దాగున్న సైన్స్ సూత్రాలను వివరించారు. చిన్నప్పటినుండే శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలన్నారు. నమ్మకాలకి మూఢనమ్మకాలకి తేడాను తెలుసుకుని, మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ఆదినారాయణ, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీనివాస్ కుమారి, అమలాశ్రీ, శ్రీదేవి పాల్గొన్నారు.


కాగితాలతో నేర్చుకుని తయారు చేసిన బొమ్మలతో చిన్నారులు


చేతిలో మంటను పెట్టుకునే మ్యాజిక్‌ను నేర్పుతున్న శిక్షకులు





పాడి పంటలపై ఆట పాటలు

కాజాలో ఘనంగా ఏరువాక ఉత్సవాలు

ప్రజానాట్య మండలి, ఐద్వా ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని ఖాజాలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా ప్రజానాట్య మండలి, బాలల సంఘం, ఐద్వా ఆధ్వర్యంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. చిన్నారుల కోలాట ప్రదర్శనలు, గేయాల ఆలాపన ఆకట్టుకున్నాయి. ఆయా ప్రదర్శనలను తిలకించేందుకు గ్రామస్తుల నుండి విశేష స్పందన లభించింది. ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్, కోలాటం శిక్షకులు డి.నాగేశ్వరరావు, అర్‌వి.రాఘవయ్య, అప్పన్న, పల్నాడు జిల్లా కార్యదర్శి టి.పెద్దిరాజు, శ్రీను, పి.ప్రసాద్, ఐద్వా నాయకులు ఎస్.సుమ, ఎ.విజయలక్ష్మి, ఎస్.విజయలక్ష్మి, బి.కోటేశ్వరి, ఆదిశేఖర్, ఎ.ప్రకాశరావు పాల్గొన్నారు.

నేడు వల్లభనేని సాంబశివరావు సంస్మరణ సభ

ప్రజాశక్తి - దుగ్గిరాల

సిపిఎం సీనియర్ నాయకులు వల్లభనేని సాంబశివరావు సమస్మరణ సభ మండలంలోని తుమ్మపూడిలోని ఆయన నివాసం వద్ద సోమవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 10.30 గంటలకు సభ ప్రారంభమవుతుందని మాజీ ఎంపీ పి.మధు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, జిల్లా కార్యదర్శి పాశం రామారావు, తదితరులు హాజరవుతారని ప్రకటనలో నాయకులు పేర్కొన్నారు.


కోటేశ్వరరావును సత్కరిస్తున్న నటుడు సాయి కుమార్

అంతర్జాతీయ పౌరాణిక కళాకారునికి అమెరికాలో సత్కారం

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన అంతర్జాతీయ పౌరాణిక కళాకారుడు ఆరాధ్యుల కోటేశ్వరరావును ఆమెరికాలో ఘనంగా సత్కరించారు. పట్టణానికి చెందిన ఆయన దేశ విదేశాల్లో పౌరాణిక నాటక ప్రదర్శనలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆమెరికాలోని నార్త్ కరోలినాలో హెచ్ఎఫ్ఎన్‌సి మారిస్‌వెల్‌లో శనివారం అక్కడి తెలుగు వారు నిర్వహించిన ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో కోటేశ్వరరావు పాల్గొన్నారు. పౌరాణిక ప్రదర్శనల్లో భాగంగా శ్రీకృష్ణరాయభారం ఏకపాత్రాభినయం చేశారు. నాటికలోని పద్యాలకు అక్కడి తెలుగు వారు మంత్రముగ్ధుల్యారని, కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ సినీ గేయరచయిత జొన్నవిత్తుల, నటులు సాయికుమార్ తనను ఘనంగా సత్కరించినట్లు కుటుంబసభ్యుల ద్వారా ఆదివారం తెలిపారు.

జ్ఞాన వెంకట సురేష్ కుమార్‌కు పిహెచ్‌డి

ప్రజాశక్తి - మంగళగిరి



మంగళగిరి పట్టణానికి చెందిన పి.జ్ఞాన వెంకట సురేష్ కుమార్‌కు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో పిహెచ్‌డిని ప్రధానం చేసింది. 'ఏ కాంప్రెస్సీవ్ స్టడీ ఆఫ్ ఫ్యూచర్ సెలక్షన్ ఫర్ ఇంట్రుజన్ డిటెక్షన్ సిస్టంకు యూజింగ్ మిషన్ లెర్నింగ్ అప్రోచెస్' అంశంపై డాక్టర్ షహీద్ అక్తర్ పర్యవేక్షణలో పరిశోధనకుగాను పిహెచ్‌డిని ప్రదానం చేశారు.

పెదనందిపాడులో జరగనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు వాయిదా

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండల కేంద్రమైన పెదనందిపాడులోని కరణం చిన్నయ్య జెడ్‌పి పాఠశాలలో ఆదివారం నుండి ప్రారంభం కావాల్సిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను అకాల వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. పోటీలు ఈ నెల7వ తేదీ నుండి ప్రారంభం అవుతాయని, 8, 9, 10, తేదీల్లోనూ కొనసాగుతాయని తెలిపారు. ఈ విషయాన్ని ప్రేక్షకులు, క్రీడాకారులు గమనించి తమకు సహకరించాలని నిర్వాహకులు, పత్తిపాడు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ షేక్ కాసిం పీరా, ఏబీ పాలెం సొసైటీ చైర్మన్ కూరేటి భూషయ్య, చెరుకూరి సాంబశివరావు కోరారు.

'అవినీతి, అక్రమాలను విమర్శిస్తే దాడులా?'

ప్రజాశక్తి-చిలకలూరిపేట



నెల్లూరులో టిడిపి నేత ఆనం వెంకటరమణారెడ్డిపై దుండగుల దాడి యత్నాన్ని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఖండించారు. స్థానిక పండరీపురంలోని ఆయన నివాసంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఆనంపై దాడి యత్నాన్ని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ప్రభుత్వ అవినీతి, అక్రమాలను విమర్శిస్తే దాడులు చేస్తారా? అని ప్రశ్నించారు. గతంలోనూ రాష్ట్ర వ్యాప్తంగా తెదేపా నాయ కులు, కార్యకర్తలపై ఎన్నో దాడులకు వైకాపా మూకలు పాల్ప డ్డాయి. కడప జిల్లా ప్రొద్దుటూరులోనూ యువగళం పాద యాత్రలో లోకేశ్ పై కోడిగుడ్లతో దాడి చేసి కవ్వింపు చర్యలకు దిగారని విమర్శించారు. ఇప్పటికైనా వైసిపి ఇలాంటి దుర్మార్గపు చర్యలను ఆపకపోతే రాబోయే రోజుల్లో భారీ మూల్యం చెల్లించుకో తప్పదని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా దాడికి యత్నించిన దుండగులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కన్నా లక్ష్మినారాయణను సత్కరిస్తున్న నేతలు

కన్నాను కలిసిన నియోజకవర్గ నేతలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి కన్నా లక్ష్మీనారాయణ కాపు నాయకులు కలిసారు. సత్తెనపల్లి నియోజకవర్గం కాపు నాయకులు కన్నా లక్ష్మీనారాయణ ను ఆదివారం కలిసారు. కన్నాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాపు నాయకులు యద్దనపూడి నరేష్, సోమిశెట్టి సుబ్రహ్మణ్యం,లడ్డు , సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

గుర్రప్పనాయుడుపాలెం సొసైటీ చైర్మన్ మృతి

ప్రజాశక్తి-నూజెండ్ల



వైసిపి సీనియర్ నాయకులు, గుర్రప్ప నాయుడుపాలెం సొసైటీ చైర్మన్ పారా వెంకటేశ్వర్లు (75) తన స్వగ్రామమైన జెడ్డావారిపాలెంలో ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకటేశ్వర్లు భౌతికకాయానికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు,మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ,వైసీపీ నాయకులు నివాళులర్పించారు. నివాళులర్పించారు వెంకటేశ్వర్లు అంతిమయాత్రలో వారు పాల్గొన్నారు.

రైతులకు జీవనాధారంగా ఇంగ్లీష్ గడ్డి

- జొన్న జాతికి చెందిన గడ్డి విత్తనాలతో పెరిగే గ్రాసం
- పట్టణంలోని మురుగునీటిని వినియోగిస్తున్న రైతులు
- సుమారు 35 ఎకరాలలో సాగు
- ఎండుగడ్డి కొనలేకపోతే ఇదే ప్రత్యామ్నాయం



ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని మురుగునీటితో పెరుగుతున్న ఇంగ్లీష్ గడ్డి రైతుకు జీవనాధారమైంది. ఒక వైపు నుంచి కోస్తుంటే మరోవైపు నుంచి పెరుగుతుంటుంది.ఎండా కాలంలో ఎండుగడ్డి ఒక ఎకరం రూ.18 వేలు పెట్టి కొనలేక, పూర్తిగా దీంతోనే పశువులను మేపలేక ఈ ఇంగ్లీష్ గడ్డితో కాలం వెళ్ల బుచ్చుతున్నారు. పశుపోషకులు. జొన్న జాతికి చెందిన గడ్డి విత్తనాలతో పండేది ఇంగ్లీష్ గడ్డి. వీటిని బొంత జొన్న విత్త



పిచ్చి చెట్లు, ముళ్ల చెట్ల కారణంగా ఆగిన మురుగునీరు

నాలు అని కూడా అంటారు. ఈ రకమైన విత్త నాలకు ఎక్కువగా నీరు అవసరం తడి ఉంటే చాలు మొల కెత్తుతాయి. స్థానిక చార్లెస్ కాన్వెంట్ దాటిన తరువాత పెదనంది పాడు రోడ్డు పక్కనే సుమారు 35 ఎకరాలలో కొన్నేళ్లుగ దాదాపు 40 మంది రైతులు ఈ గడ్డిని పండిస్తున్నారు. పట్టణము నుంచి పారే మురుగు నీటిను నిల్వ చేసుకుని, అవసరమైనప్పుడు వాడుకుంటున్నారు. కళామందిర్ సెం టర్ నుంచి చార్లెస్ కాన్వెంట్ వరకు పట్టణంలోని 6 వార్డు ల ప్రజలు వాడుకొని వదులుతున్న నీటితో రైతులు ఈ గడ్డిని పెంచుతున్నారు. మిగిలిన వార్డుల్లోని ప్రజలు వినియోగించిన నీటిని ఓగేరు వాగులో కలుపుతున్నారు.

ఈ పంట కాలపరిమితి మూడేళ్లు. ఒక ఎకరాకు బొంత జొన్న విత్తనాలు 12 నుంచి 15 కిలోలు అవసరం. సుమారు ఇరవై ఏళ్ల క్రితం కిలో రూ.70- రూ.90 కు వీటిని అమ్మేవారు. క్రమేపి ధరలు పెరిగిపోవ డంతో పెరుగుతూ ప్రస్తుతం కిలో బొంత జొన్న విత్తనాల ధర రూ.700 ఉంది. మరో రకమైతే రూ.900 పలుకు తోంది. ఈ రకం విత్తనాలతో వచ్చిన గడ్డిని పశువులకు వాడితే పాల దిగుబడి ఎక్కువ వస్తాయంటున్నారు. ఎకరానికి ఒక బ స్తా యూరియా, ఒక బస్తా 20.20 ఎరువులు వేస్తే ఒక ఏడాది వరకు సరిపోతుందని రైతులు చెబుతున్నారు. ఈ గడ్డి వేసే ముందు పెసలు,తెల్ల,పచ్చ జొన్నలు, జీలిగలు, జనుము విత్తనాలు చల్లి సుమారు నెల రోజుల తర్వాత దున్ని, ఆ తర్వాత ఈ గడ్డి విత్తనాలు వేస్తుంటామని చెప్పారు. గతంలో ఎస్.జీ. జీ సూడా న్ గ్రాస్ విత్తనాలు వేసే వారు. బొంత జొన్న విత్తనాలకు బదులు పాలు దిగుబడి ఇచ్చే విత్తనాలను ప్రముఖ కంపెనీలు తయారు చేసి అమ్ముతున్నారని, ప్రస్తుతం వాటిని వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఈ తరహా గడ్డికి డిమాండ్ రావడంతో దానికి అ నుగుణంగా కౌలు ధర పెంచుతున్నారని, దీంతో కౌలు, ఇతర వ్యవసాయ ఖర్చులు పెరిగిపోయాయని రైతులు చెప్పారు.

పట్టణములోని జాతీయ రహదారికి ఇవతల వైపు ప్రజలు వాడుకున్న నీటిని మొత్తం కాల్వల ద్వారా ఈ పశు గ్రాసం పం డే ప్రాంతం వైపు తిప్పాలని, అలా చేస్తే మురుగునీటి కొరత లేకుండా వందల ఎకరాల్లో సాగు చేయొచ్చని రైతులు చెబుతున్నారు.

దురదలు, చర్మవ్యాధులు వస్తున్నాయి



కల్లి సాంబిరెడ్డి

మానుకొండువారిపాలెంకు చెందిన రైతు కల్లి సాంబిరెడ్డి మాట్లాడుతూ గత పద్దెనిమిది ఏళ్ల నుంచి 30 సెంట్లలో వ్యవసాయం చేస్తున్నానని, మూడు బర్రె గొడ్లు ఉన్నాయని , వాటి నుంచి వచ్చే పాలను విక్రయిస్తూ కుటుం బాన్ని నెట్టు కొస్తున్నట్లు చెప్పారు. 30 సెంట్లకు కౌలు ధర రూ. 5,000 వేలు ఇస్తు న్నామన్నారు. గడిచిన పద్దెనిమిదేళ్లలో నాలుగు సార్లు ఈ విత్తనాలు వేశామన్నారు. అయితే, మొదట్లో ఈ విత్తనాలు 30 సెంట్లకు 6 కేజీలు పట్టేవని అప్పట్లో కిలో రూ. 80 అని అన్నారు. చేతులు, కాళ్లకు జిల, దురద, చర్మ వ్యాధులు వస్తున్నాయని, గడ్డి పనులు పూర్తయి ఇంటికి వెళ్లిన తర్వాత కాళ్లుచేతులకు కొబ్బరి నూనె రాసు కుంటామని చెప్పారు.

గడ్డి, బలం విత్తనాలను ఉచితంగా ఇవ్వండి



వెంకటేశ్వర్లు

ప్రస్తుతం మురుగు నీటిలో ప్లాస్టిక్ వస్తువులు, ఇతర వ్యర్థపదార్థాలు వస్తున్నట్లు రైతు వెంకటేశ్వర్లు చెప్పారు. దీంతో, మురుగునీటి ప్రవాహానికి అంతరాయం కలుగుతోందని, ఒక్కోసారి పొలాలకు ఆ నీరు చేరడం లేదని అన్నారు. గడ్డి విత్తనాలను, బలం విత్తనాలు (జీలిగ, పెసలు, జొన్న,జనుము,పచ్చ,తెల్ల జొ న్నలు) ఉచితంగా లేదా పూర్తి సబ్సిడీపై ఇవ్వాలని వ్యవసాయ శాఖాధికారులకు విజ్ఞప్తి చేశారు.



ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో ఆగిన మురుగునీరు

రైతుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

వైసిపి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించిందని టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. సత్తెనపల్లి మండలం పెదమక్కెనలో టిడిపి ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ ,కోడెల విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మేడి పట్టి కన్నా లక్ష్మీనారాయణ పొలం దున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి అన్నంపెట్టే రైతన్న బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఆళ్ళ అమరేశ్వరరావు, టిడిపి నేతలు ఆళ్ళ సాంబయ్య నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, రావిపాటి నానయ్య అంచుల నరసింహారావు లగడపాటి గజానన తెదేపా నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు **నాదెండ్ల:** పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం కనపర్రులో మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు నేతృత్వంలో ఆదివారం ఏరువాక పౌర్ణమి వేడుకలను పండగ వాతావరణంలో నిర్వహించారు. కనపర్రులో ఎడ్లు, ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. కర్షకులతో కలిసి రైతు పచ్చా మోహన్ పొలంలో దుక్కి దున్ని వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ ఈ ఏడాది సమద్ధిగా వర్షాలు కురిసి వ్యవ సాయ పనులు సజావుగా సాగి అధిక దిగుబడులు సాధిం చాలని ఆకాంక్షించారు. రైతు ఆనందంగా ఉంటే సమాజం కూడా సంతోషంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ చర్యలతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం తగ్గి పోతోందన్నారు. ఈ ఏడాది సాగునీటి సర







ఏరువాక కార్యక్రమాల్లో పాల్గొన్న టిడిపి సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ, జీవీ ఆంజనేయులు, చదలవాడ అరవిందబాబు





ఫరాపై సర్కారు ఎలాంటి స్పష్టతనివ్వలేదని విమర్శించారు. కార్యక్రమంలో నాదెండ్ల మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ,నరసరావుపేట పార్లమెంట్ రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి చిలకలూరిపేట నియోజకవర్గ పరిశీలకులు దాసరి ఉషారాణ తదితరులు పాల్గొన్నారు. **విజయపురిసౌత్:** రైతు సంక్షేమం తెలుగుదేశం పార్టీ తోనే సాధ్యమని మాచర్ల టిడిపి ఇన్ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మాచర్ల మండలం కొప్పునూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఏరువాక పౌర్ణమి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. బ్రహ్మారెడ్డి పంచెకట్టు ధరించి నాగలి తో పొలం దున్ని రైతులను ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి,టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు. **ఈపూరు:** వైసిపి నాలుగేళ్ల పాలనలో వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని రైతులు అప్పుల పాలయ్యారని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విమర్శించారు. మండల కేంద్రమైన ఈపూరులో రైతులతో కలిసి ఏరువాక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామ కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి చంద్రబాబు చిత్రపటానికి ధాన్యపు గింజలతో అభిషేకం చేశారు. పల్నాడు జిల్లా టిడిపి అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, మండ లాధ్యక్షులు పాల్గొన్నారు. **నరసరావుపేట:** వైసిపి అధికారం లోకి వచ్చాక వ్యవసాయ రంగాన్ని రైతులను నిర్లక్ష్యం చేసిం దని, రాయితీపై వ్యవసాయ పరికరాలు నీటి పంపుసెట్లు, పిచికారీ యంత్రాలు ఇవ్వలేదని టిడిపి నియోజకవర్గ ఇన్ ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు విమర్శించారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా మండలంలోని కేతిముక్కల అగ్రహారంలో అరక పట్టి పొలం దున్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర రైతు అధ్యక్షులు మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మన్ పులిమి రామిరెడి పాల్గొన్నారు.

8న తెనాలి మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక

ప్రజాశక్తి-తెనాలి

తెనాలి పురపాలక సంఘం వైస్ చైర్మన్ ఎన్నికకు ఎన్నికల కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈనెల 8న ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాల్లో ఎన్నిక జరుగుతుందని, ఎన్నికల అధికారిగా తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మను జిల్లా కలెక్టర్ నియమించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు ఇప్పటికే ప్రకటించారు. పురపాలక సంఘానికి ఇరువురు వైస్ చైర్మన్ల సంప్రదాయానికి వైసిపి ప్రభుత్వం ప్రభుత్వం నుంచే ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో తొలుత మాలేపాటి హరిప్రసాద్, గుంటూరు కోటేశ్వరరావు వైస్ చైర్మన్‌లుగా ఎన్నికయ్యారు. ఏడాది కాలం పూర్తి కావటంతో గతేడాది డిసింబర్ 29న గుంటూరు కోటేశ్వరరావు వైస్ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి కాళీగా ఉన్న రెండో వైస్ చైర్మన్ పదవి భర్తీకి ఎన్నికల కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో ఆశావహులు ప్రయత్నాలు మొదలెట్టారు.



కౌన్సిల్‌లో మొత్తం 40 మంది సభ్యులుంటే, వారిలో 32 మంది వైసిపి వారే. కేవలం ఎనిమిది మంది మాత్రమే ప్రతిపక్షంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే ఎవరికి అవకాశం ఇస్తే వారి ఎన్నిక లాంఛనమవుతుంది. అయితే వైస్ చైర్మన్ రేసులో 11వ వార్డు కౌన్సిలర్ కఠారి రత్నకుమారి పేరు ప్రథమంగా వినిపించినా, సామాజిక సమీకరణాల్లో వెనుకబడింది. దానికి కారణం రాజీనామా చేసిన కోటేశ్వరరావు కూడా అదే సామాజిక తరగతికి

అధికంగా అశావహులు - రానున్న ఎన్నికల దృష్ట్యా సామాజిక సమీకరణాలపైనే ఎమ్మెల్యే దృష్టి

చెందిన వారు. ప్రస్తుతం 40వ వార్డు కౌన్సిలర్ అత్తోట నాగవేణి పేరు ప్రధానంగా వినిపిస్తోంది. 30వ వార్డు కౌన్సిలర్ కొమరాబత్తిని జయపాల్, 39వ వార్డు కౌన్సిలర్ గెడ్డటి ఝాన్సివాణి, 24వ వార్డు కౌన్సిలర్ పెదలంక లక్ష్మీ లావణ్య పేర్లు కూడా వినబడుతున్నాయి. అయితే రానున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా సామాజిక సమీకరణలో ఎమ్మెల్యే ఆచాతూచి అడుగు వేస్తున్నారు. ప్రత్యేకించి ఎస్సీల్లో మాదిగ సామాజిక తరగతి కొంత అలకలో ఉన్నట్లు నియోజకవర్గంలో ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో ఆ సామాజిక వర్గాన్ని ప్రసన్నం చేసుకునేందుకు ఇది అవకాశంగా ఎమ్మెల్యే భావిస్తున్నట్లు ఆ పార్టీలో విశ్వసనీయ వర్గాల సమాచారం. అదే నిజమైతే అత్తోట నాగవేణి రెండో వైస్ చైర్మన్ కావటం ఖాయంగా తెలుస్తోంది. రాజకీయంగా పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో అదృష్టం ఎవరిని వరిస్తుందో చివరి వరకూ వేచి చూడాల్సిందే.

ఈ నాలుగేళ్లలో తీవ్ర సంక్షోభంలోకి రైతులు

- **మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శ**
- **పలుచోట్ల టిడిపి ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి**



కొల్లిపర మండలం దావులూరులో

ప్రజాశక్తి - కొల్లిపర

రాష్ట్రంలో ఈ నాలుగేళ్లలో అన్నదాతలు తీవ్ర సంక్షోభంలో కూలిపోయారని మాజీ మంత్రి అలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో భాగంగా ఆదివారం కొల్లిపర మండలం దావులూరు పొలాల్లో రైతులతో కలిసి రాజేంద్రప్రసాద్ నాగలితో దుక్కి దున్ని వరి విత్తనాలు చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో వ్యవసాయం 11 శాతం వృద్ధి సాధించింది అన్నారు. కౌలురైతుల ఆత్మహత్యల్లో దేశంలోనే మన రాష్ట్రం రెండో స్థానంలో ఉందని, పంటలకు మద్దతు ధర కల్పించలేని దౌర్భాగ్య స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. రైతులకు భరోసా కల్పిస్తామంటూ మోటార్లకు మీటర్లు బిగించి రైతుల మెడకు ఉరితాడు బిగిస్తున్నారనారు. ఆర్.బి కేల పేరుతో ఆర్భాటమే తప్ప రైతులకు ఒరిగిందేమీ లేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బి.చిన్నకోటిరెడ్డి, నాయకులు వి.సామిరెడ్డి, కె.మూర్తిరాజు, ఎ.వీరారెడ్డి, ఎస్.చలపతిరావు, టి.హరిప్రసాద్, చంద్రబాబు, బి.చంద్రిక పాల్గొన్నారు.

చిర్రావూరులో



ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరులో ఏరువాక కార్యక్రమాన్ని తెలుగు రైతు గుంటూరు జిల్లా అధ్యక్షులు కళ్లం రాజశేఖర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. గ్రామంలోని పొలంలో దుక్కి దున్నారు. ముఖ్య అతిథులుగా తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, టిడిపి మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకి దేవి, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.సాంబశివారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బి.పిచ్చిరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాసరావు, ఎం.సత్యనారాయణ, ఎ.సుబ్బారావు, కె.కిరణ్, కె.శేషు, వి.శ్రీనివాసరావు, ఎ.ఉమామహేశ్వరరావు, ఎ.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

టిడిపి మండల అద్యక్షులు జి.శివరాం ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్తిపాడులో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త మాకినేని పెదరత్తయ్య హాజరయ్యారు. నాయకులు జి.వెంకటేశ్వరరావు, కె.పెంటరెడ్డి, భాగ్యరావు, తిమ్మపురం సర్పంచ్ కె.శ్రీనివాస్, కె.సుబ్బారెడ్డి, వి.సుబ్బారావు, ఎస్.నవీన్, ఎం.రవి, వీరయ్య చౌదరి, కె.సైదారావు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డులో క్రీడా మైదానం ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి

క్రీడలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు ఆరోగ్య వంతమైన జీవనం సాధ్యమవుతుందని కోమటి జయరాం, వేమూరి రవికుమార్ అన్నారు. ఆదివారం తాడేపల్లి బైపాస్‌రోడ్డులో క్రీడా మైదానాన్ని వారు ప్రారంభించారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రీడా మైదానం ప్రారంభ సూచికగా వాలీబాల్, క్రికెట్ ఆడారు. క్రీడా మైదానంలో నాలుగు షటిల్ కోర్టులు, రెండు క్రికెట్ ప్రాక్టీస్ నెట్‌లు, వాలీబాల్ కోర్టు, వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంటిఎంసి పరిధిలో దినదినాభివృద్ధి చెందుతున్న తాడేపల్లి క్రీడాకారుల అభివృద్ధికి తగ్గట్టుగా క్రీడా మైదానం ఏర్పాటు చేసినట్లు



చెప్పారు. టోర్నమెంట్ నిర్వహించుకోవడానికి క్రికెట్ కిట్‌తో పాటు వాలీబాల్ నెట్ ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ క్రీడల్లో తర్ఫీదు పొంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు సంపాదించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కె.మహాలక్ష్మి, టి.జానకీదేవి, శ్రీనివాసరావు, వి.వెంకట్రావు, జి.మరియదాసు, ఇ.భాస్కర్, కె.శేషు, టి.సాంబశివరావు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో పేరు నమోదుకు లంచం?!

ప్రజాశక్తి - ఫిరంగిపురం

తమ పొలానికి వేరొకరి పేరుతో పాస్ పుస్తకాన్ని పుట్టించిన విఆర్‌ఒ ఇప్పుడు దాన్ని సరి చేయడానికి రూ.లక్ష డిమాండ్ చేస్తున్నారని మండలంలోని బేతపూడికి చెందిన మొగిలిపాలెం గోవిందరావు ఆరోపిస్తున్నారు. బాధిత రైతు వివరాల ప్రకారం.. గ్రామంలోని సర్వే నంబర్ 193లోని అరెకరం పొలాన్ని రాజారపు సుబ్బమ్మ తన కుమార్తె అయిన మొగిలిపాలెం లక్ష్మమ్మకు సుమారు 24 ఏళ్ల కిందట బహుమానం కింద ఇచ్చారు. దీనికి పట్టాదారు పాస్‌పుస్తకమూ ఉంది. అయితే ఈ పొలాన్ని మొగిలిపాలెం లక్ష్మమ్మ పేరు మీద ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆమె కుమారుడు గోవిందరావు 2020లో విఆర్‌ఒను కోరారు. అయితే ఇందుకు తొలిగా సర్వే చేసి ధ్రువపత్రం ఇచ్చారని, ఇందుకుగాను రూ.5 వేలు తీసుకున్నారని గోవిందరావు చెబుతున్నారు. అయితే ఆన్‌లైన్‌లో మాత్రం తన తల్లిపేరు నమోదు చేయలేదని, సర్వేర్ సాకులు చెబుతున్నారని, ఇప్పుడు రూ.లక్ష డిమాండ్ చేస్తున్నారని బేతపూడి విఆర్‌ఒ షేక్ సుభానిపై ఆరోపణలు చేస్తున్నారు. మరోవైపు తాము ఆన్‌లైన్‌లో పరిశీలించగా పరస షేక్ మహమ్మద్ అనీఫ్ పేరుతో పాస్‌పుస్తకం ఉందని, ఇది విఆర్‌ఒ పని అని ఆరోపించారు. విఆర్‌ఒపై ఇప్పటికే అనేక ఫిర్యాదులు ఉన్నాయని, కూలి పనులు చేసుకుని బతికే మమ్మల్నీ అన్యాయం చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని మీడియా ఎదుట ఆదివారం వాపోయారు.

క్షతగాత్రునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంగళగిరి

పొలంలో విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి వెళ్లిన ప్రైవేటు ఎలక్ట్రీషియన్ అయిన మంచికలపూడికి చెందిన మణికంఠ షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. శరీరంలోని 30శాతం కాలింది. ఇది తెలిసిన



విజయ హెల్త్ కేర్ ట్రస్ట్, బిసి సంక్షేమ సంఘం నాయకులు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20 వేలను ఆదివారం అందించారు. బాధితుణ్ణి పరామర్శించిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షులు పి.మహేష్, విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఫౌండర్ కె.స్వాతిగౌడ్, సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యు.శ్రీనివాస్, శివాజీ యాదవ్, టి.కిరణ్, ఎం.నాగదుర్గ, మధు వెంకటేశ్వరరావు ఉన్నారు.



సభలో మాట్లాడుతున్న డాక్టర్ మధు

'నేటి తరానికి మేటి వైద్యం హోమియోపతి'

ప్రజాశక్తి-గుంటూరు

అతి తక్కువ ఖర్చుతో అనేక వ్యాధుల నుంచి విముక్తి చేసి, ఆరోగ్యవంతుల్ని చేస్తున్న హోమియోపతిని నేటి తరానికి మేటి వైద్యంగా చెప్పుకోవచ్చని హోమియో, ఆక్యుపంక్చర్ వైద్యులు డాక్టర్ మధు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ మధు మాట్లాడుతూ ప్రొఫెసర్ టి.వి.రత్నారావు అధ్యక్షతన జరిగిన సభలో డాక్టచ్ మధు మాట్లాడుతూ చిన్న వ్యాధుల నుంచి దీర్ఘకాలిక వ్యాధుల వరకూ హోమియోపతిలో మందులున్నాయని చెప్పారు. ఎటువంటి రుగ్మతనైనా తక్కువ కాలంలో సులువుగా బాగు చేయవచ్చని చెప్పారు. హోమియోపతి వైద్యంపై ఉన్న అపోహలను నివృత్తి చేసుకొని దానిపై సమగ్ర అవగాహన చేసుకుంటే ఎవరికి వారే చికిత్స చేసుకోవచ్చన్నారు. మనిషిని కేవలం ఒక రోగిలా చూస్తూ నిముషాల్లో చీటీ రాసి ఇచ్చేయటం కాకుండా, మనిషి తత్వాన్ని శరీరంలో తలెత్తిన సంక్షోభాన్ని సానుకూలంగా అర్థం చేసుకొని దానిని బట్టి చికిత్స చేయటం హోమియో పతిలోని మౌలిక అంశం అన్నారు. అనంతరం ఆక్యుపంక్చర్ వైద్య విధానాల గురించి వివరించారు. ప్రకృతిపరంగా ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండా తక్కువ ఖర్చుతో నడుం, భుజం, మెడనొప్పులు తగ్గించుకోవచ్చని చెప్పారు. అనంతరం డాక్టర్ మధుని అవగాహన సభ్యులు సన్మానించారు. టివి.సాయిరాం, రాంబాబు పాల్గొన్నారు.



పేద విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన రజక వాలంటీర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందిస్తున్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రజకచెరువు కూడలిలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో పదో తరగతిలో ప్రతిభ చూపిన 101 మంది విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు నగదుతో పాటు రీడింగ్ చైర్స్, ఫ్లాంక్స్, నూతన వస్త్రాలు, వాటర్ బాటిల్స్, నోట్‌బుక్స్‌తో కిట్‌ను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిభగల పేద విద్యార్థులను సంస్థ ద్వారా ప్రోత్సహించటం అభినందనీయమన్నారు. వైవి రమేష్‌బాబు, పి.నారాయణరావు, బాలవెంకటేశ్వరరావు, స్థానిక కౌన్సిలర్ వి.విజయలక్ష్మి, ఎంపిటిసి డి.చెన్నకేశవులు, సంస్థ అధ్యక్ష కార్యదర్శులు పి.ప్రసాద్, పి.శ్రీనివాస్, వి.మహాలక్ష్మి, డాక్టర్ వినీల్, మధుబాబు, ఎం.వంశీ, లక్ష్మీలావణ్య పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి - క్రోసూరు



ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రతి ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోనూ తప్పనిసరిగా అమలు చేయాలని వైద్యారోగ్య శాఖాధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. మండల కేంద్రమైన క్రోసూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను, వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడారు. వైద్యులు, సిబ్బందితో చర్చించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు తీరుపై వాకబు చేశారు. రోగులకు ఇబ్బందుల్లేకుండా వైద్యం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ అధికారి రాజకుమారి, తహశీల్దార్, ఎంపిడిఒ పాల్గొన్నారు.

నిత్యం మాడిపోతున్నారు!

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్



రైళ్ల కోసం ప్రయాణికులు ప్లాట్ ఫామ్‌పై ఎండలో పడిగాపులు పడుతున్నారు. సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌లో ప్లాట్ ఫామ్ చివరి వరకు రేకుల షెడ్డు ఏర్పాటు చేయకపోవడంతో మండుటెండలో ప్రయాణికులు అవస్థ పడుతున్నారు. సత్తెనపల్లి రైల్వే స్టేషన్ మీదుగా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రయాణిస్తూ ఉంటాయి. ప్రతిరోజూ సుమారు 1500 మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్లాట్‌పామ్ చివరి వరకు షేడ్ లేకపోవటంతో, అసలే వేసవి దృష్ట్యా ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రయాణికుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

సాధారణ రైతే పెద్ద శాస్త్రవేత్త

- నూతన పద్ధతులతో అధిక దిగుబడులు సాధించండి
- ఏరువాక పౌర్ణమి సందర్భంగా నాగలి పట్టిన జెసి రాజకుమారి





అరక దున్నుతున్న జెసి, ట్రాక్టర్ నడుతుపుతున్న జెసి

ప్రజాశక్తి - గుంటూరు

దీర్ఘకాలికంగా పంటలు సాగు చేస్తున్న రైతే పెద్ద శాస్త్రవేత్త అని గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. నూతన సాగు యాజమాన్య పద్ధతులను అవలంభిస్తూ భూసారన్ని కాపాడుతూ నాణ్యమైన అధిక దిగుబడులను సాధించాలని రైతులకు సూచించారు. ఏరువాక పౌర్ణమిలో భాగంగా గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. నాగేంద్ర స్వామి పుట్ట క్షేత్రంలో జెసి స్వయంగా నాగలి పట్టి పొలం దున్నారు. ట్రాక్టర్ నడుపుతూ కొద్దిసేపు పొలం దున్ని విత్తనాలు చల్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ తమది వ్యవసాయ కుటుంబమని, తన తండ్రి రైతు అని చెప్పారు. విద్యార్థి దశలో సెలవుల సమయంలో వ్యవసాయ పనుల్లో పాల్గొన్న అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. పంటల సాగులో రైతుల కష్టాలు తనకు తెలుసని, రైతులకు అధికారికంగా అందించాల్సిన సహాయంపై ఎల్లప్పుడు ముందుంటామని అన్నారు. ప్రభుత్వ పథకాలను వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచనల ప్రకారం పంటలు మార్పిడి విధానాన్ని అమలు చేస్తూ భూసారాన్ని కాపాడాలన్నారు. ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరువుల వినియోగం, మిశ్రమ పంటల సాగు ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను సాధించొచ్చని చెప్పారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతు సుభిక్షంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. జొన్నలగడ్డ తొలిసారిగా మెట్ట వరిని ప్రయోగాత్మకంగా సాగు చేసి సఫలీకృతమై రాష్ట్ర వ్యాప్తంగా రైతులు మెట్ట వరిని సాగు చేసే ఘనత సాధించిందన్నారు. ఎపిసిఎన్‌ఎఫ్ డిపిఎం రాజకుమారి మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగం వల్ల భూసారం తగ్గిపోవడంతో పాటు పంట ఉత్పత్తులు నాణ్యత ఉండవన్నారు. అనంతరం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను జెసి అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ టి.శ్రీనివాసరావు, తూర్పు మండల తహశీల్దార్ నగేష్, జొన్నలగడ్డ ఉప సర్పంచ్ నవీన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు

- సమర్థవంతంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు
- విలేజి క్లినిక్‌లలో మహిళలకు ఎంఎల్‌హెచ్‌లతో చికిత్స
- ప్రజాశక్తితో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి శ్రావణ్‌బాబు

ఇంటర్వ్యూ

జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను మెరుగుపర్చేందుకు విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ విధానం సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు తెలిపారు. ప్రతి మండలంలో రెండు పిహెచ్‌సిలు ఉన్నాయని, వీటిల్లో పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది ఉన్నారని ఆయన తెలిపారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లోనే వైద్యసేవలు ప్రజలకు మెరుగ్గా అందిస్తున్నామన్నారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.



పిహెచ్‌సిలు ఎన్ని ఉన్నాయి? వాటిల్లో ఏయే సేవలు అందిస్తున్నారు?

జిల్లాలో 22 పిహెచ్‌సిలున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఒపి చూస్తున్నారు. పిహెచ్‌సిలో ఒక డాక్టర్ ఉంటారు. మరొకరు 104 వాహనంలో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి ఫ్యామిలీ డాక్టర్ విధానంలో చికిత్సలు అందిస్తారు. సాయంత్రం నుంచి తెల్లవారి వరకు ఇద్దరు స్టాఫ్ నర్సులు ఉంటారు. ఒక్కో పిహెచ్‌సిలో మొత్తం 14 మంది సిబ్బంది ఉంటారు.

ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు ఎలా ఉంది?

గ్రామాల్లో ప్రతి కుటుంబాన్ని పర్యవేక్షిస్తూ ఆరోగ్య సూత్రాలు పాటించేలా సలహాలు, సూచనలు ఇస్తూ ఒక వైద్యుడు, సిబ్బంది గ్రామాలను సందర్శిస్తారు. 104 వాహనంలో ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రతి కుటుంబంలో అనారోగ్యం బారిన పడిన వారిని గుర్తించి వారికి చికిత్సలు అందిస్తారు. ఒక్కో గ్రామానికి రెండుసార్లు ఫ్యామిలీ డాక్టర్‌లా వెళతారు. వైద్య బృందం ఆయా గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఉంటారు. జనరల్ ఒపి, వైరల్ వ్యాధులు, హైపర్‌టెన్షన్, బిపి, షుగర్, గర్భిణులకు ప్రసవానికి ముందు సేవలు, బాలింతలకు ప్రసవానంతర సేవలు, శిశు సంరక్షణా, చిన్నారులకు వైద్య పరీక్షలు, రక్తహీనత కేసులను చూస్తారు. తరువాత పాఠశాలల్లో విద్యార్థులను, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను పరిశీలిస్తారు. దీర్ఘకాలిక సమస్యలతో మంచంలో ఉన్న రోగులను ప్రత్యేకంగా గుర్తించి వారిని స్వయంగా పలకరించి వారికి చికిత్సలు అందిస్తారు. రక్తహీనత కలిగిన చిన్నారులను గుర్తించి వారికి మందులు ఇస్తారు. ఫ్యామిలీ డాక్టర్ పేరు, ఫోను నెంబరు, సిబ్బంది వివరాలను ఆయా గ్రామాల్లో ప్రజలకు తెలియజేసి ప్రజలకు వారితో సన్నిహిత సంబంధాలు ఉండేలా చూస్తున్నాం.

అర్బన్ హెల్త్ సెంటర్లు ఎలా పనిచేస్తున్నాయి?

పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలందించేందుకు అర్బన్ హెల్త్‌సెంటర్లు ప్రారంభించారు. మొత్తం 50 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. ఉదయం 9 గంటలనుంచి సాయంత్రం 5 గంటలవరకు వైద్యులు చికిత్సలు అందిస్తారు. పారామెడికల్ సిబ్బంది, పరిపాలన సిబ్బంది కూడా ఉంటారు. ప్రాథమిక చికిత్సలన్నీ చేస్తారు.

విలేజి క్లినిక్‌లుపని తీరు ఎలాఉంది?

జిల్లాలో 211 విలేజ్ క్లినిక్‌లు అందుబాటులోకి వచ్చాయి. బిఎస్‌సి నర్సింగ్ చేసినవారు, వైద్య చికిత్సలు చేసిన సిబ్బంది విలేజ్ క్లినిక్‌లలో అందుబాటులో ఉంటారు. మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు అందుబాటులో ఉంటారు. వీరు మహిళలకు తగిన చికిత్సలు చేస్తారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో డెలివరీలు, రోజువారి ఒపిలు, బుధవారం, శనివారం ఇమ్యూనైజేషన్, వాక్సిన్‌లు ఎప్పటికప్పుడు ఇస్తారు. 211 క్లినిక్‌లకు గాను 160 వరకు శాశ్వత భవనాలున్నాయి. 50 చోట్ల భవనాల నిర్మాణం జరుగుతోంది.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ తదితరులు

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిరస్మరణీయుడు

ప్రజాశక్తి-గుంటూరు

ఎంతో మంది ప్రజల అభిమానం పొందిన గానగంధర్వుడు ఎస్.పి బాలసుబ్రహ్మణ్యం చిరస్మరణీయుడని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు అన్నారు. ఆదివారం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా నాజ్ సెంటర్ సర్కిల్‌లోని ఆయన విగ్రహం వద్ద కళాదర్బార్, ది ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ ఆధ్వరంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో మేయర్ పాల్గొన్నారు. ఎస్పీ బాలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన మేయర్ మాట్లాడుతూ ఎస్.పి బాల సుబ్రహ్మణ్యం తెలుగు వాడిగా పుట్టటం మన అదృష్టమన్నారు. ఆయన గాన మాధుర్యంతో ఎంతో మంది ప్రజల అభిమానాన్ని పొందారని, అటువంటి వారి స్మృతులు ప్రజలు ఎప్పటికి మర్చిపోకూడదని అన్నారు. ఎస్.పి బాల సుబ్రమణ్యం దేశంలోని అన్ని భాషలలో పాటలు పాడారని, ఏ భాషలో పాట పాడినా ఆబాషకు చెందిన వ్యక్తిగా పాడేవారని చెప్పారు. ఆయన తెలుగు వారవడం మనం గర్వించదగ్గ విషయం అన్నారు. తెలుగు ఖ్యాతిని విశ్వవిఖ్యాతం చేసిన బాల సుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేసినందుకు కళాదర్బార్ అధ్యక్షులు పొత్తూరు రంగారావును అభినందించారు.

రూ.799కే డయాలసిస్ సదుపాయం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రోటరీ, రెడ్‌క్రాస్ సౌజన్యతో గుంటూరులో రోగులకు డయాలసిస్ సదుపాయం అందుబాటులోకి వచ్చిందని రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ ఛైర్మన్ రామచంద్రరాజు, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ప్రెసిడెంట్ కాలేషా వలి, రోటరీ జిల్లా గవర్నర్ రాజశేఖర్ తెలిపారు. గుంటూరులోని సెయింట్ జోసెఫ్ ఆస్పత్రిలో ఉన్న చిగురుపాటి నాగేశ్వరరావు డయాలసిస్ సెంటర్‌లో వారు మీడియాతో మాట్లాడారు. గుంటూరు నగరంలోని సెయింట్ జోసెఫ్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన చిగురుపాటి నాగేశ్వరరావు డయాలసిస్ సెంటర్లో ఈ సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. రెడ్‌క్రాస్ రోటరీ సహకారంతో కిడ్నీ పేషెంట్లకు కేవలం రూ. 799కు డయాలసిస్ చేస్తున్నట్టు తెలిపారు. హెచ్ఐవి పేషెంట్లకు ప్రత్యేకంగా రెండు మిషన్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. రూ.2.30 కోట్లతో ఈ యూనిట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. హెచ్ఐవి రోగులను కూడా దృష్టిలో పెట్టుకుని వారికి ప్రత్యేకంగా రెండు మిషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.